గురుకుల స్కూల్ ప్రిన్సిపాల్ సస్పెన్షన్

శామీర్‌పేట్: అలియాబాద్ మున్సిపాలిటీ, తుర్కపల్లిలోని మహాత్మాజ్యోతిపూలే కళాశాల ప్రిన్సిపాల్ షీల సస్పెండ్ అయ్యారు. రెండ్రోజుల క్రితం కళాశాల, పాఠశాలలో సరైన వసతులు కల్పించాలంటూ.. విద్యార్థులు ధర్నా నిర్వహించగా మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా గురుకుల కళాశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులు కలెక్టర్‌కు వివరించిన సంగతి తెలిసిందే. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ కళాశాల ప్రిన్సిపాల్ షీలాను సస్పెండ్ చేశారు.

సమాధులను ధ్వంసం చేశారని నిరసన

కీసర: సర్వే నెంబర్–9లో 10 గుంటల భూమిలోని శ్మశానవాటికలో ముదిరాజ్ కుటుంబసభ్యుల సమాధులు ఉన్నాయి. ఈ మేరకు బుధవారం శ్మశానవాటిక పక్కన ఉన్న పట్టాదారు శ్మశానవాటిక భూమిని ఆక్రమించేందుకు కొన్ని సమాధులను ధ్వంసం చేసి మట్టితో చదును చేశారని ఆరోపించారు. దీంతో బాధితులు వారి పూర్వీకుల సమాధులను ధ్వంసం చేయడంపై కీసరలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంబులెన్స్‌లో ప్రసవం

గాంధీ ఆసుపత్రికి తరలింపు



మేడ్చల్: పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో గర్భిణీని ఆసుపత్రి తరలించే లోపే 108లో ప్రసవించింది. మేడ్చల్ 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌లో నివాసం ఉండే సత్మాఖాతున్ నిండు గర్భిణీ. కాగా ఆమెకు బుధవారం నొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108లో ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా.. అంబులెన్స్‌లోనే ప్రసవించింది. అనంతరం తల్లీబిడ్డను గాంధీ ఆసుపత్రిలో చేర్చారు.

రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత అవగాహన శిబిరం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ మహాత్మా గాంధీనగర్‌లో ఏఐజీ ఆసుపత్రి, గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీ సంయుక్తాధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర మహిళామోర్చా ప్రచార కార్యదర్శి సుజాత నేతృత్వంలో బుధవారం ఉచిత రొమ్ము క్యాన్సర్, అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని 20 ఏళ్ల పైబడిన మహిళలకు రొమ్ము పరీక్షలు నిర్వహించామని, ప్రస్తుతం ఈ వ్యాధి పెరుగుతుందని ముందస్తుగానే గుర్తించి చికిత్స చేస్తే సులభతరం అవుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర మహిళ ఆఫీస్ ఇన్‌చార్జ్ ప్రసన్న, జిల్లా కార్యవర్గసభ్యులు ప్రదీప్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి రూ.1.33 కోట్లు

కాప్రా: అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కాప్రా డివిజన్‌కు రూ. 1.33 కోట్లు మంజూరయ్యాయి. ఎల్లారెడ్డిగూడ శ్మశానవాటికలో కనీస సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులకు రూ.84 లక్షలు, కృష్ణానగర్, ఎల్లారెడ్డిగూడలో సీసీరోడ్లకు రూ. 49.50 లక్షల మంజూరు పత్రాలను బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణికి అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు రాబట్టి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, కాంగ్రెస్ నేతలు విఠల్ నాయ్, నాగశేషు, పూర్ణయాదవ్, మల్లారెడ్డి, నాగరాజు, శ్రీధర్‌రెడ్డి, సత్తిరెడ్డి, మల్లేష్ ఆయా కాలనీల వాసులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ పునర్నిర్మాణానికి నిధులు

రామంతాపూర్ : ప్రభుత్వ దేవాదాయశాఖ రామంతాపూర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మంజూరు చేసిన రూ. 40 లక్షల నిధుల పత్రాన్ని బుధవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నామ్ రాజిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దాదాపు 125 ఏళ్ల పురాతన మల్లికార్జునస్వామి స్వయంభూ శివలింగంతో కూడిన విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు వివరించానని ఆలయ పునరుద్ధరణకు నిధుల మంజూరు చేయాలని కోరడంతో వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సురేందర్, ప్రధాన అర్చకులు మోత్కూరు శేఖర్‌బాబుశర్మ, సతీష్‌గౌడ్, జంగయ్య, శోభాలింగం, రామకృష్ణ, యాదగిరి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ట్రా'ఫికర్'!

ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల ఇబ్బంది

- బాటసారులకు తప్పని తిప్పలు
- ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- సమస్యను పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు



బాలాజీనగర్‌లో బస్సుల రద్దీ (ఫైల్)

జవహర్‌నగర్: కార్పొరేషన్‌గా జవహర్‌నగర్, మున్సిపాలిటీలుగా నాగారం, దమ్మాయిగూడ ఏర్పడి 6 ఏళ్లు దగ్గరపడుతున్నా.. ఇప్పటికీ ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేకపోతున్నాయి. ప్రధానంగా అంబేడ్కర్‌నగర్, బాలాజీనగర్, చెన్నాపురం, నాగారం, దమ్మాయిగూడ ప్రాంతాల్లో సమస్యలు అధికంగా ఉన్నాయి. ఈ సమస్యలను పట్టించుకునేవారే కరువయ్యారనే ఆరోపణలున్నాయి.

అధికారులపై ఆరోపణలు..

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, పాలకులు ఘోరంగా విఫలమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్య చిన్నగానే కనిపించినా.. వాహనదారులకు ప్రతిరోజూ నరకం చూపిస్తోంది. సాక్షాత్తు కార్పొరేషన్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఎదుట సరైన రోడ్లు, సిగ్నల్స్ పని చేయని దుస్థితి నెలకొంది. ఇక రోడ్లపైనే ఇష్టానుసారంగా పార్కింగ్‌లు, తోపుడు బండ్లు, దుకాణాలు కొనసాగుతుండగా.. బాటసారులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

బాలాజీనగర్, అంబేడ్కర్‌నగర్‌లో నిత్యం నరకం..

బాలాజీనగర్, అంబేడ్కర్‌నగర్ ప్రధాన రహదారులలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎక్కడి నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి ఉంది. హకీంపేట, సికింద్రాబాద్, ఈసీఐఎల్, ఉప్పల్ కంటోన్మెంట్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వందలాది ఆర్టీసీ బస్సులు నిత్యం వస్తుంటాయి. అసలే ఇరుకు రోడ్లు ఆ రోడ్డులో సగందాకా దుకాణాలు వెలుస్తున్నాయి. ట్రాఫిక్ అధికంగా ఉండే ఉదయం, సాయంత్రం వేళ్లలో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.



జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్

డంపింగ్ వాహనాలతో సమస్య..

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌కు నిత్యం వందలాది వాహనాలు వచ్చిపోతుంటాయి. వాటిలో కొన్ని బాలాజీనగర్ నుంచి వెళ్తుండటంతో రోడ్లు ఇరుకుగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. వాణిజ్య పరంగా పేరున్న జవహర్‌నగర్ పట్టణం కూడా రోజురోజుకూ పెరుగుతోంది. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు లేక ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు..

దుకాణదారులు రోడ్డుపైకి వచ్చి వస్తువులు పెడుతుండటంతో భారీ వాహనాలు వస్తే మరో వాహనం వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్స్ లేక రాంగ్‌రూట్‌లో ఎక్కువగా వాహనదారులు ప్రయాణిస్తున్నారు.

ప్రమాదాల పాలవుతున్న వాహనదారులు

గతేడాది సెప్టెంబర్‌లో డంపింగ్‌యార్డ్ వద్ద డివైడర్ లేకపోవడంతో భారీ వాహనాలు ఎదురుగా రావడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ఇటీవల మరణించాడు.

రోడ్డు విస్తరణ చేయకుండానే...

బాలాజీనగర్ ప్రధాన రహదారి విస్తరణ చేయకుండానే రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. ఇక్కడే 2 వైన్స్ దుకాణాలు, 2 బార్లు నడుస్తుండటంతో వాహనదారులు రోడ్డుపై పార్కింగ్ చేసి ప్రయాణికులకు నరకం చూపిస్తున్నారు. సాయంత్రం వేళల్లో మహిళలు అక్కడి నుంచి నడవాలంటేనే జంకుతున్నారు. బస్టాండ్ కూడళ్లలో ప్రైవేట్ వాహనాలు ఇష్టానుసారంగా నిలపడం ఇబ్బందికరంగా మారుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పట్టించుకుని ప్రధాన రహదారిని విస్తరించి, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టి సమస్యను పరిష్కరించాలి



పట్టణానికి తగినట్లు 100 ఫీట్ రోడ్డును ఏర్పాటు చేసి డివైడర్‌తో పాటు అన్ని ప్రధాన సర్కిళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి. దుకాణదారుల అక్రమ పార్కింగ్‌లను తొలగించి తగిన చర్యలు తీసుకోవాలి. బాలాజీనగర్‌లో 55 నుంచి 35 ఫీట్లకు రోడ్డును కుదించడం సరికాదు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– రాహుల్, జవహర్‌నగర్

సమస్యను పరిష్కరిస్తాం



జవహర్‌నగర్, నాగారం, దమ్మాయిగూడ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య కొంత ఇబ్బందికరంగానే ఉంది. త్వరలోనే అన్ని ప్రధాన కూడళ్లలో సిగ్నల్స్ సమస్యను పరిష్కరిస్తాం. రోడ్లపై ఆక్రమణలు, పార్కింగ్ తదితర సమస్యలపై వివిధశాఖల అధికారులను సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటాం.

– శివకుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

స్పందించారు.. తొలగించారు!

సాక్షి ఎఫెక్ట్..

మేడ్చల్: 'నాడు అవార్డు .. నేడు బేజారు' శీర్షికన సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ తమ బృందంతో వ్యర్థాలను వేస్తున్న ప్రాంతాల్లో పర్యటించి వ్యర్థాలను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి అధికారులతో మాట్లాడి సమస్యలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలన్నారు. అధికారులు బాధ్యతగా పని చేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానా విధిస్తున్నట్లు ఆయన వివరించారు.



హౌజింగ్ బోర్డు కాలనీలో తొలగించిన చెత్త

కల్లు కంపౌండ్లపై దాడులు..

వేర్వేరు చోట్ల అరెస్ట్‌లు, కేసులు నమోదు

సాక్షి,మేడ్చల్ జిల్లా: కల్లు కంపౌండ్లపై ఎస్టీఎఫ్ టీమ్‌లు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశాయి. ఇటీవల కల్తీకల్లు అమ్మకాలు, అనుమతిలేని కల్లు డిపోల నిర్వహణ, అనుమతి లేకుండా కల్లు రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి కల్తీకల్లు ఘటనతో హైదరాబాద్ సహా నగరంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా 'ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్' కమిషనర్ హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం కల్లు కాంపౌండ్‌లను తనిఖీ చేశారు. బుధవారం దూల్‌పేట్‌లో ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి అధ్వర్యంలో మూడు చోట్ల దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేశారు.

- దూల్‌పేట్, మల్లాకుంట ప్రాంతంలో బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 70లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నారు. ఈ కల్లు శాంపిల్ తీసుకుని మిగిలిన దానిని పారబోశారు. ఈ కేసులోని నిందితుడిని అదుపులోకి తీసుకుని, మరొకరిపై కూడా కేసు నమోదు చేశారు. – దూల్‌పేట్‌లోని మంగళ్‌హాట్ ప్రాంతంలో 247 లీటర్ల కల్లుకు అనుమతిలేకపోవడంతో పారబోసి, ఒకరిని అరెస్టు చేసి మరొకరిపై కేసు నమోదు చేశారు.



కల్లు శాంపిళ్లను సేకరించిన అధికారులు

- గుడిమల్కాపూర్ హీరానగర్‌లో అనుమతిలేని కల్లు డిపోలోని 382 లీటర్ల కల్లును పారబోశారు. గోదా రాఘవేందర్‌గౌడ్‌ను అరెస్టు చేసి, రామకృష్ణగౌడ్‌పై కేసు నమోదు చేశారు. ఈ మూడు కేసులను దూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. మరో రెండు కేసుల్లో ఎస్టీఎఫ్ టీమ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, నాగరాజు అధ్వర్యంలో శేరిలింగంపల్లిలో కల్లు డిపోలపై దాడులు నిర్వహించి శాంపిల్స్‌ను సేకరించారు. హైదర్‌నగర్, రంగారెడ్డినగర్, తర్కముల్ ప్రాంతాల్లోని కల్లు డిపోల్లో దాడులు నిర్వహించి శాంపిళ్లను సేకరించారు.

నేడు 'దిశ' సమావేశం

జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ చైర్మన్‌గా ఎంపీ ఈటల

సాక్షి,మేడ్చల్ జిల్లా: 3 నెలలకోసారి జరగాల్సిన.. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం 6 నెలల తర్వాత గురువారం మేడ్చల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈటల రాజేందర్ అధ్యక్షతన జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ 30 పథకాలపై పర్యవేక్షణతో పాటు వాటి అమలు, నిధుల వినియోగం తదితర అంశాలను చర్చించనున్నారు.

- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ)పరిధిలోకి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, కంటోన్మెంట్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి (కొంతపార్ట్) అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి వస్తాయి. ఈ కమిటీకి కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు.

3 నెలలకోసారి 'దిశ'..

ప్రతి 3 నెలలకోసారి దిశ సమావేశాలు జరగనున్నాయి. మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్ బాధ్యతలు చేపట్టిన 7 నెలల తర్వాత ఈ ఏడాది జనవరి 8న మొట్టమొదటి దిశ సమావేశం సుదీర్ఘంగా జరిగింది. ఈ కమిటీలో ఎంపీ, కలెక్టర్‌తో పాటు 8 మంది శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, నగర పాలక సంస్థ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు (డీఆర్డీవో)లతో పాటు పలువురు నామినేటెడ్ సభ్యులు ఉంటారు. జిల్లా ,మండల పరిషత్‌లు పూర్తిగా మాయం కావడంతో పాటు పురపాలక సంఘాల పాలక వర్గాల పదవీకాలం ముగిసిపోవడంతో ప్రస్తుతం జరిగే సమావేశంలో వారి ప్రాతినిధ్యం ఉండదని తెలుస్తోంది.



సీజనల్ వ్యాధులపై అవగాహన



మారుతీనగర్‌లో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కీసర: 100 రోజుల కార్యాచరణలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు మారుతీనగర్ కాలనీలో డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన కల్పించారు. తడి, పొడి వ్యర్థాలను వేరు చేయడంపై అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అవగాహన, రోడ్డుకు ఇరువైపున ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించడం తదితర కార్యక్రమాలు నిర్వహించి కాలనీలో పూల మొక్కలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్స్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'తపస్'ను బలపరచండి

మల్కాజిగిరి: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్)ను బలపరచాలని రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ పిలుపు నిచ్చారు. బుధవారం మల్కాజిగిరి మండల పరిధిలోని పలు పాఠశాలల్లో 2025–26 సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపస్ కేవలం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఇటీవల జరిగిన రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ విజయం సాధించిందన్నారు. జిల్లా, మండల నాయకులు రాజ్‌కుమార్, రమేష్‌రాథోడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాముయాదవ్ హౌస్ అరెస్ట్

గౌతంనగర్: డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత భర్త, బీఆర్‌ఎస్ నేత మేకల రాముయాదవ్ హౌస్ అరెస్ట్ అయ్యారు. అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య జరిగిన గొడవలో ఆయన గాయపడిన విషయం తెలిసిందే. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బుధవారం ఆయనను మల్కాజిగిరి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యం

మేడిపల్లి: ఏటీఎల్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయత అవగాహన, పరిశోధన, పరిశీలన, సృజనాత్మకతను విద్యార్థుల్లో పెంపొందించవచ్చని డీఈఓ విజయకుమారి అన్నారు. మేడిపల్లి ప్రధానోపాధ్యయుడు సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఏటీఎల్ ల్యాబ్ అవగాహన ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. కాలానికనుగుణంగా సాంకేతికతపై అవగాహనకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సాంకేతిక విద్యలో మెళకువలు నేర్పడానికి ఈ ఏటీఎల్ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల్లో ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంపొందించడమే ఏటీఎల్ ల్యాబ్‌ల ముఖ్య ఉద్దేశమన్నారు. ఏటీఎల్ ల్యాబ్ నీతిఅయోగ్ ఆధ్వర్యంలో అమలు అవుతున్న అటల్ ఇన్నొవేషన్ మిషన్‌లో భాగంగానే ఏర్పడిందని స్పష్టం చేశారు. ఏఎంఓ రవీందర్‌రాజు, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ విజయకుమారి

స్వచ్ఛతపై కమిషనర్ పర్యటన

మేడ్చల్: పట్టణంలోని 23వ వార్డులో మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి పర్యటించారు. బుధవారం పర్యటించిన ఆయన బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని, తడి, పొడి చెత్త స్వచ్ఛ వాహనాల్లో వేయాలని సూచించారు. అర్హత ఉండి ఇందిరమ్మ ఇళ్లు రాని వారు నిరాశ చెందొద్దని, మరో విడతలో వస్తాయన్నారు. వార్డులో 100 రోజుల ప్రణాళిక అమలును పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మాజీ కౌన్సిలర్ మహేష్, కాంగ్రెస్ నేతలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ యశ్వంత్‌కుమార్ తెలిపారు. ప్రశాంత్‌నగర్‌కాలనీ, ఎన్ఎఫ్‌సీ నగర్ గ్రామం, బొక్కోనిగూడ, ఏదులాబాద్ వ్యవసాయ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, శివారెడ్డిగూడ, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో మ ధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జవహర్‌నగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా 11కేవీ డెంటల్ కాలేజీ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సేవాలాల్ తండా, భగత్‌సింగ్ కాలనీ, గబ్బిలాల్‌పేట, శాంతినగర్, రాజీవ్‌నగర్ కాలనీ, 11కేవీ సంతోష్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంతోష్‌నగర్, చెన్నాపురం చౌరస్తా, బీజేఆర్‌నగర్, పాపయ్యనగర్, నందమూరినగర్, సత్యనారాయణ కాలనీ, మల్లికార్జుననగర్, దుర్గాభవానీకాలనీ, జ్యోతిరావుకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు.

శామీర్‌పేట్: నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని శామీర్‌పేట్ విద్యుత్ ఏఈ పత్రిక ప్రకటన ద్వారా బుధవారం తెలిపారు. గురువారం చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ, ఉద్దమర్రి 33/11కేవీ నుంచి 11కేవీ స్నేహ ఫార్మ్స్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీంతో ఉద్దమర్రి, లింగాపూర్ తండా, స్నేహ పౌల్ట్రీఫామ్, పప్పుమిల్లు పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

మేడ్చల్: మద్యం తాగి ద్విచక్రవాహనాలను నడిపిన ఇద్దరు వ్యక్తులకు మేడ్చల్ కోర్టు జైలుశిక్ష విధించింది. మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. 4 రోజుల క్రితం డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు మేడ్చల్ 7వ ఎంఎం ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరచగా.. న్యాయమూర్తి జైలుశిక్ష విధించారు. ఇద్దరిని చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

- మొక్కలు నాటి సంరక్షించాలన్న అడిషనల్ కలెక్టర్
- దమ్మాయిగూడలో 'మొక్క నాటు– గిఫ్ట్ పట్టు'
- పలుచోట్ల మొక్కలు నాటిన విద్యార్థులు



అవుషాపూర్‌లో మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

ఘట్‌కేసర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. బుధవారం మున్సిపాలిటీ అవుషాపూర్ గ్రామంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మొక్కలు నాటారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... విరివిగా మొక్కలు నాటి పర్యవరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఇంటిలో ఒక మొక్కను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. అనంతరం అనురాగ్ విశ్వవిద్యాలయం విద్యార్థులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేశ్, మాధవరెడ్డి, జంగయ్యముదిరాజ్, మశ్చేందర్‌రెడ్డి, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, అనురాగ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

క్రాంతి కీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

కీసర: దమ్మాయిగూడలోని క్రాంతి కీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మొక్క నాటు – గిఫ్ట్ పట్టు' అనే పర్యావరణ చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కాలనీ, అపార్టుమెంట్ల వాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ పీఎస్ఆర్ క్రాంతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పచ్చదనం కోసం ముందుకు రావాలని ఇందుకు ప్రేరణగా మేముంటామనే సందేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించే వారికి ఫౌండేషన్ తరఫున ప్రతినెల బహుమతులు అందజేస్తామన్నారు. ప్రిన్సిపాల్ కల్యాణి, జాకోబ్, సంతోష్, డైరెక్టర్ లావణ్య, స్థానికులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు..

శామీర్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎస్ఆర్ జ్యోతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శామీర్‌పేట్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తడి, పొడి, హానికరమైన చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'పర్యావరణ పరిరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ రహిత సమాజం' అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.ఇఫ్రత్, అధ్యాపకబృందం, ఎన్‌సీసీ కేడెట్లు, కళాశాల విద్యార్థులు, పురపాలక సంఘం సిబ్బంది పాల్గొన్నారు.



దమ్మాయిగూడలో..



అధ్యాపకులతో కలిసి మొక్క నాటుతున్న విద్యార్థులు